


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 18-10-2026 | సంపుటి - 31 | సంచిక - 146 | రూ : 4 | పేజీలు: 8



పర్యావరణ హితమే బతుకమ్మ సందేశం

- రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్‌శుక్లా
- కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

అంబర్‌పేట, హైదరాబాద్: తెలంగాణ మహిళలు తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ వేడుకలు... ప్రజలకు పర్యావరణాన్ని కాపాడుకోవాలనే సందేశాన్ని ఇస్తాయని గవర్నర్ శివప్రతాప్ శుక్లా గుర్తుచేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని, ఇది మనందరి బాధ్యతన్నారు. శనివారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకలకు.. తన సతీమణితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ''ప్రకృతితో మమేకమయ్యే బతుకమ్మ ఉత్సవాలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును పొందాయి. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంతోనూ ఈ వేడుకలకు అవినాభావ సంబంధం ఉంది. తీరొక్క పూలతో చేసే బతుకమ్మలు... ప్రకృతి తల్లి ప్రేమకు, తెలంగాణ సంస్కృతికి, మహిళాశక్తికి, వారి ఐక్యతకు ప్రతిరూపాలు'' అని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ''పేద, ధనిక తారతమ్యాలు లేకుండా అంతా ఒకచోట చేరి నిర్వహించే పూల పండగే బతుకమ్మ. బతుకమ్మ పాటలతో అనాదిగా మహిళలంతా సామాజిక దురాచారాలను దూరం తరువాయి 2లో

హైదరాబాద్‌లో ఈడీ దాడులు..
ఆన్‌లైన్ గేమింగ్ గుట్టురట్టు!

- హైదరాబాద్ సహా ఐదు నగరాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై ఈడీ దాడులు
- అక్టోబర్ 13న 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు
- దుబాయ్ కేంద్రంగా బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు సాగుతున్నట్లు గుర్తింపు
- షెల్ కంపెనీలు, క్రిప్టో కరెన్సీ



ద్వారా నిధులను విదేశాలకు తరలిస్తున్నట్లు వెల్లడి

- కేసుతో సంబంధం ఉన్న పలు బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసిన ఈడీ 2లో

పిల్లలకు ఇంటర్నెట్‌పై
సుప్రీంకోర్టు కీలక తీర్పు

- పిల్లలకూ ఇంటర్నెట్ వినియోగ హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- ఆర్టికల్ 21, 19(1)(a) కింద ప్రాథమిక హక్కుల రక్షణ ఉంటుందని వ్యాఖ్య 2లో





బిస్కెట్లలో పశువుల దాణా
సంస్థపై FSSAI కొరడా

- ప్రియగోల్డ్ బిస్కెట్లలో పశువుల దాణా వాడినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆరోపణ
- తయారీ సంస్థ సూర్య ఫుడ్ అండ్ ఆగ్రోపై ప్రాసిక్యూషన్‌కు ఆదేశం
- తనిఖీల్లో పరిశుభ్రతా లోపాలు, ఇతర ఉల్లంఘనలు గుర్తింపు
- ఇప్పటికే కం పెనీ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ను రద్దు చేసిన అధికారులు
- దొడ్ల డెయిరీతో సహా పలు సంస్థలపైనా చర్యలు తీసుకున్న ఎఫ్ఎస్ఎస్ఏఐ

దేశవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిన 'ప్రియగోల్డ్' బిస్కెట్ల తయారీలో పశువుల దాణా వినియోగిస్తున్నట్లు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సంచ తరువాయి 2లో

భారత్ వైపు నేపాల్ చూపు..
బలేన్ షా పర్యటనపై ఆసక్తి!

- బాలేంద్ర షా నవంబరు 22 లేదా 23న భారత్‌కు వచ్చే అవకాశం
- పునర్నిర్మాణానికి భారీ ఆర్థిక సాయం కోరుతున్న నేపాల్
- సరిహద్దు వివాదాలు, వాణిజ్య ఒప్పందంపై చర్చలు
- మూడు కొత్త విమాన ప్రవేశ మార్గాలకు అనుమతి కోరుతున్న నేపాల్
- మూడు ప్రధాన జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చించే అవకాశం

నేపాల్ ప్రధాని బాలేంద్ర షా భారత్ పర్యటనకు సిద్ధమవుతున్నారు. నవంబరు 22 లేదా 23 తేదీన ఆయన న్యూఢిల్లీకి వచ్చే అవకాశముంది. ఈ పర్యటనలో భారత్ నుంచి భారీ ఆర్థిక సాయం పొందడమే ప్రధాన లక్ష్యంగా నేపాల్ ప్రభుత్వం



అడుగులు వేస్తోంది. దీంతో పాటు సరిహద్దు వివాదాలు, వాణిజ్యం, విమాన మార్గాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చించాలని భావిస్తోంది. ఆగస్టు 26న నేపాల్‌లో వచ్చిన భారీ వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. దాదాపు 1,500 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 5,000 మందికి పైగా ఆచూకీ తెలియడం లేదు. రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ కేంద్రాలు దెబ్బతిన్నాయి. తరువాయి 2లో

తెలంగాణకు వర్ష సూచన..
పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక!



- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరం పై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ

తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి తరువాయి 2లో



లండన్‌లో మోదీకి 2లో
ఎన్నారైల భారీ మద్దతు

- భారత్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాన్ని ఖండించిన ఎన్నారైలు
- విమర్శలుంటే కోర్టులకు వెళ్లాలని, దేశ పరువు తీయొద్దని హితవు
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి మద్దతిస్తున్నామన్న ప్రవాసీయులు
- భారత్ వ్యతిరేక శక్తులతో కలవొద్దంటూ విద్యార్థులకు 'రీచ్ ఇండియా' సూచన

హెచ్-1బీ..
నిపుణులకు కొత్త కష్టాలు



- ఈపడీ 540 రోజుల ఆటోమేటిక్ పొడిగింపును రద్దు చేస్తూ అమెరికా నిర్ణయం
- హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములపై ఈ నిబంధన ప్రభావం అధికం
- గడువులోగా ఈపడీ రెన్యూవల్ కాకపోతే ఉద్యోగం నిలిపివేయాల్సిందేనని స్పష్టీకరణ 2లో

పర్యావరణ హితమే బతుకమ్మ సందేశం

అంబర్‌పేట, హైదరాబాద్: తెలంగాణ మహిళలు తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ వేడుకలు... ప్రజలకు పర్యావరణాన్ని కాపాడుకోవాలనే సందేశాన్ని ఇస్తాయని గవర్నర్ శివప్రతాప్ శుక్లా గుర్తుచేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని, ఇది మనందరి బాధ్యతన్నారు. శనివారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకలకు.. తన సతీమణితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ''ప్రకృతితో మమేకమయ్యే బతుకమ్మ ఉత్సవాలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును పొందాయి. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంతోనూ ఈ వేడుకలకు అవినాభావ సంబంధం ఉంది. తీరొక్క పూలతో చేసే బతుకమ్మలు... ప్రకృతి తల్లి ప్రేమకు, తెలంగాణ సంస్కృతికి, మహిళాశక్తికి, వారి ఐక్యతకు ప్రతిరూపాలు'' అని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ''పేద, ధనిక తారతమ్యాలు లేకుండా అంతా ఒకచోట చేరి నిర్వహించే పూల పండగే బతుకమ్మ. బతుకమ్మ పాటలతో అనాదిగా మహిళలంతా సామాజిక దురాచారాలను దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నారు'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, భాజపా నేతలు గౌతంరావు, ప్రేంసింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో 72 అడుగుల ఎత్తుతో రూపొందించిన బతుకమ్మకు యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కింది. కిషన్‌రెడ్డి సతీమణి కావ్య, దేవి కలెక్టివ్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్ నీలిమ సంబంధిత ధ్రువపత్రాన్ని అందుకున్నారు.



భారత్ వైపు నేపాల్ చూపు..

బలేన్ షా పర్యటనపై ఆసక్తి!

నేపాల్ ప్రధాని బాలేంద్ర షా భారత్ పర్యటనకు సిద్ధమవుతున్నారు. నవంబరు 22 లేదా 23 తేదీన ఆయన న్యూఢిల్లీకి వచ్చే అవకాశముంది. ఈ పర్యటనలో భారత్ నుంచి భారీ ఆర్థిక సాయం పొందడమే ప్రధాన లక్ష్యంగా నేపాల్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో పాటు సరిహద్దు వివాదాలు, వాణిజ్యం, విమాన మార్గాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చించాలని భావిస్తోంది. ఆగస్టు 26న నేపాల్‌లో వచ్చిన భారీ వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. దాదాపు 1,500 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 5,000 మందికి పైగా ఆచూకీ తెలియడం లేదు. రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ కేంద్రాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో పునర్నిర్మాణ పనుల కోసం భారత్ నుంచి భారీ సాయాన్ని నేపాల్ కోరుతోంది. తక్కువ షరతులతో నిధులు అందించాలని ఆశిస్తోంది. లిపులేఖ్, కాలాపానీ, లింపియధురా ప్రాంతాలపై కొనసాగుతున్న వివాదాన్ని కూడా నేపాల్ ప్రస్తావించనున్నట్లు సమాచారం. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని ముందుగానే సమీక్షించాలని కోరుతోంది. భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్) ధ్రువీకరణ నిబంధనల వల్ల తమ దేశ ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని కోరుతోంది. ప్రస్తుతం నేపాల్‌కు వచ్చే అంతర్జాతీయ విమానాల్లో ఎక్కువ శాతం సిమరా మార్గం మీదుగానే ప్రవేశిస్తున్నాయి. దీంతో రద్దీ పెరుగుతోంది. జనక్‌పుర్, భైరహవా, నేపాల్‌గంజ్ మీదుగా కొత్త విమాన ప్రవేశ మార్గాలకు అనుమతి ఇవ్వాలని నేపాల్ కోరుతోంది. భద్రతా కారణాలతో భారత్ ఈ ప్రతిపాదనపై ఆచితూచి వ్యవహరిస్తోంది. 750 మెగావాట్ల వెస్ట్ సేతి, 480 మెగావాట్ల ఫుకోట్ కర్ణాలి, 450 మెగావాట్ల సేతి రివర్ 6 ప్రాజెక్టులపై చర్చించే అవకాశముంది. భారత్ సాయంతో నిర్మించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈ పర్యటనలో ప్రారంభించనున్నారు. వరదల తర్వాత పునరుద్ధరణ పనులకు భారత్ గ్రాంట్లు, రాయితీ రుణాలు అందించాలని నేపాల్ కోరుతోంది.

తెలంగాణకు వర్ష సూచన..

పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక!

తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

మున్సిపల్ ఎన్నికలు

కూటమి సీట్ల లెక్క తేలింది!

అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయ నిపుణులు, వారి కుటుంబ సభ్యులపై తీవ్ర ప్రభావం చూపే కీలక నిర్ణయాన్ని యూఎస్ ప్రభుత్వం తీసుకుంది. 'ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్' (ఈఏడీ) కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వర్తించే 540 రోజుల ఆటోమేటిక్ పొడిగింపు నిబంధనను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇది ముఖ్యంగా హెచ్ 1బీ వీసాదారుల జీవిత భాగస్వాములైన హెచ్ 4 వీసా హోల్డర్లకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఈ మేరకు అక్టోబర్ 14, 2026న తుది నిబంధనను జారీ చేసింది. వాస్తవానికి 2025 అక్టోబర్ 30న ప్రవేశపెట్టిన తాత్కాలిక విధానాన్ని ఇప్పుడు శాశ్వతంగా అమలులోకి తెచ్చింది. బైడెన్ పరిపాలన 2022లో ఈఏడీ రెన్యూవల్ ప్రాసెసింగ్‌లో నెలకొన్న తీవ్ర జాప్యాన్ని అధిగమించేందుకు ఈ 540 రోజుల పొడిగింపు సౌలభ్యాన్ని కల్పించింది. దీని ప్రకారం గడువులోగా రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు, తమ పాత ఈఏడీ గడువు ముగిసినా మరో 540 రోజుల పాటు చట్టబద్ధంగా పనిచేసేందుకు వీలుండేది. అయితే, తాజా నిబంధన ప్రకారం 2025 అక్టోబర్ 30వ తేదీ లేదా ఆ తర్వాత ఈఏడీ రెన్యూవల్ కోసం దాఖలు చేసిన దరఖాస్తులకు ఈ 540 రోజుల ఆటోమేటిక్ పొడిగింపు వర్తించదు. హెచ్ 4 వీసాదారులు, ఆశ్రయం కోరినవారు, శరణార్థులు, అడ్జస్ట్‌మెంట్ ఆఫ్ స్టేటస్ దరఖాస్తుదారులు వంటి పలు కేటగిరీల వారికి ఈ మార్పు వర్తిస్తుంది. దీనివల్ల ప్రస్తుతం ఉన్న ఈఏడీ గడువు ముగిసేలోగా యూఎస్‌సీఐఎస్ నుంచి కొత్త అనుమతి పత్రం రాకపోతే, ఆ వ్యక్తి తక్షణమే ఉద్యోగం మానేయాల్సి ఉంటుంది. కొత్త ఈఏడీ చేతికి వచ్చే వరకు వారు చట్టబద్ధంగా పని చేయడానికి వీలుండదు. ఈ మార్పుతో హెచ్ 4 ఈఏడీపై ఆధారపడి పనిచేస్తున్న వేలాది భారతీయ కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. ఆర్థిక స్థిరత్వం, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. అయితే, ఎఫ్ 1 వీసాపై చదువుతున్న STEM OPT విద్యార్థులకు 180 రోజుల ఆటోమేటిక్ పొడిగింపు యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. అలాగే 'ఎల్', 'ఈ' వీసాలపై ఉన్న జీవిత భాగస్వాములు ఈఏడీ అవసరం లేకుండానే వారి స్టేటస్ ఆధారంగా పనిచేసేందుకు అర్హులు. ఈ నేపథ్యంలో ఈఏడీ పునరుద్ధరణ కోసం దరఖాస్తుదారులు వీలైనంత ముందుగా, కనీసం 68 నెలల ముందే అప్లై చేసుకోవాలని ఇమ్మిగ్రేషన్ నిపుణులు సూచిస్తున్నారు. దీంతోపాటు నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా పొడిగింపుల విషయంలో గతంలో ఇచ్చిన అనుమతులకు ప్రాధాన్యం ఇచ్చే పద్ధతిని రద్దు చేసే మరో ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది.

హైదరాబాద్‌లో ఈడీ దాడులు.. ఆన్‌లైన్ గేమింగ్ గుట్టురట్టు!

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్, సైబర్ ఫ్రాడ్ సిండికేట్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్, ముంబై, పుణే, మెహసానా, సూరత్ నగరాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో మనీలాండరింగ్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని గుర్తించినట్లు ఈడీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 13న నిర్వహించిన ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర సాక్ష్యాధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద, ఈ కేసుతో సంబంధం ఉన్న పలు సంస్థలు, వ్యక్తుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు పేర్కొంది. "ఆల్ ప్యానెల్ ఎక్స్ఛేంజ్", "MGM91" అనే ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రజల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకుని మోసం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో భాగంగా గతంలో పుణె, ముంబై, బెంగళూరు నగరాల్లో సోదాలు జరిపిన అధికారులు, ఎడ్జమ్ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రామ్ యూ రాంధానిని అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. బాధితుల నుంచి సేకరించిన నిధులను రాంధానికి చెందిన పుణె సంస్థ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించినట్లు దర్యాప్తులో తేలింది. రాంధాని సంస్థ "ఐపైసా" (iPaisa) అనే ప్రత్యేక పేమెంట్ ప్లాట్‌ఫామ్‌ను సృష్టించి, దాని ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ ఆపరేటర్ల కోసం 200కు పైగా షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా లావాదేవీలు నడిపినట్లు ఈడీ గుర్తించింది.
ఈ బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు దుబాయ్ కేంద్రంగా సాగుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ అక్రమ లావాదేవీలకు, నిధుల మళ్లింపునకు కొన్ని సహకార బ్యాంకులు కూడా సహకరించినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా సంపాదించిన డబ్బును మూడు మార్గాల్లో దేశం దాటించినట్లు గుర్తించారు. వాణిజ్య లావాదేవీల ముసుగులో ఓవర్ ఇన్వాయిసింగ్ ద్వారా, ఏపీఎంసీ యూనిట్ల పేరుతో తెరిచిన మ్యూల్ ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేయడం ద్వారా, చివరిగా క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చి విదేశాలకు తరలించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది.

బిస్కెట్లలో పశువుల దాణా: సంస్థపై FSSAI కొరడా!

దేశవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిన 'ప్రియగోల్డ్' బిస్కెట్ల తయారీలో పశువుల దాణా వినియోగిస్తున్నట్లు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సంచలన ప్రకటన చేసింది. ఈ తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినందుకు గాను, ప్రియగోల్డ్ తయారీ సంస్థ అయిన 'సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో లిమిటెడ్'పై ప్రాసిక్యూషన్ ప్రారంభించేందుకు అనుమతి మంజూరు చేసినట్లు శనివారం వెల్లడించింది. ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో కంపెనీ తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో, 'పశువుల దాణాకు మాత్రమే ఉద్దేశించినది' అని స్పష్టంగా రాసి ఉన్న తవుడు బస్తాలను అధికారులు కనుగొన్నారు. మనుషుల వినియోగానికి ఏమాత్రం పనికిరాని ఈ తవుడును, బిస్కెట్లలో ఫైబర్ (పీచుపదార్థం) కోసం ముడిసరుకుగా వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆరోపణలతో పాటు, సదరు పరిశ్రమలో మరిన్ని లోపాలు ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తమ ప్రకటనలో పేర్కొంది. పరిశ్రమ ప్రాంగణంలో అపరిశుభ్రత, పురుగుల నివారణ చర్యలు చేపట్టకపోవడం, ముడిసరుకుల నిల్వలో నిర్లక్ష్యం, సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం వంటి అనేక ఉల్లంఘనలను గుర్తించినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో, కంపెనీ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ను ఇప్పటికే సస్పెండ్ చేశామని, తాజాగా క్రిమినల్ చర్యల్లో భాగంగా ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చామని వివరించింది. సాధారణంగా ధాన్యాల పైపొర అయిన తవుడును ఆహారంలో ఫైబర్ కోసం వాడుతుంటారు. అయితే, మనుషుల కోసం వాడే 'ఫుడ్‌గ్రేడ్' ముడిపదార్థాలకు, పశువుల దాణాకు నాణ్యత, భద్రతా ప్రమాణాల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. పశువుల దాణాగా నిర్దేశించిన పదార్థాలను మనుషుల ఆహారంలో కలపడం చట్టరీత్యా తీవ్రమైన నేరం. ఈ చర్యలు కేవలం ప్రియగోల్డ్ సంస్థకే పరిమితం కాలేదు. ఫుల్ క్రీమ్ మిల్క్ శాంపిల్‌లో డిటర్జెంట్ అవశేషాలు గుర్తించినందుకు 'దొడ్ల డెయిరీ'పై, ఎండు ద్రాక్షలో పురుగుమందులు అవశేషాలు ఉన్నందుకు యూఈఐఆర్ ఆర్గానిక్ ఫుడ్స్‌పై కూడా ప్రాసిక్యూషన్ చర్యలు ప్రారంభించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. అయితే, ఏయే ప్రియగోల్డ్ బిస్కెట్ వేరియంట్లలో ఈ ఉల్లంఘనలు జరిగాయి, ఏ బ్యాచ్‌లకు ఇది వర్తిస్తుంది అనే వివరాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించలేదు. అలాగే, దేశవ్యాప్తంగా ఆ బిస్కెట్లను వెనక్కి తీసుకోవాలని (రీకాల్) కూడా ఇప్పటి వరకు ఆదేశాలు జారీ చేయలేదు.

పిల్లలకు ఇంటర్నెట్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు

పిల్లలకు ఇంటర్నెట్ అందుబాటును పూర్తిగా నిరాకరించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇంటర్నెట్‌ను వినియోగించుకునే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, ఆర్టికల్ 19(1)(a) కింద ప్రాథమిక హక్కులతో ముడిపడి ఉందని పేర్కొంది. పిల్లల భద్రత పేరుతో వారిని పూర్తిగా ఇంటర్నెట్‌కు దూరం చేయడం సరికాదని తెలిపింది. పిల్లల రక్షణకు, వారి స్వేచ్ఛకు మధ్య వైరుధ్యం లేదని, రెండింటినీ కాపాడాల్సిన బాధ్యత ఉందని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. సోషల్ మీడియా వేదికలు, ఇతర ఆన్‌లైన్ సేవల్లో పిల్లలపై లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను గుర్తించి తొలగించే వ్యవస్థలను బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేసే క్రమంలో ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్‌లో భావప్రకటనా స్వేచ్ఛతో పాటు సమాచారాన్ని తెలుసుకునే, పొందే, ఇతరులతో పంచుకునే హక్కు కూడా ఇమిడి ఉందని వివరించింది. ఇంటర్నెట్ అనేది ఆలోచనలు, సృజనాత్మకత, సమాచార మార్పిడికి వేదిక అని పేర్కొంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు విద్య, సమాచారాన్ని పొందేందుకు ఇంటర్నెట్ ఒక్కటే ప్రధాన మార్గంగా ఉంటోందని తెలిపింది. ప్రత్యేక అవసరాలున్న పిల్లలు ఇతరులతో పరిచయాలు పెంచుకోవడానికి, తమలాంటి పరిస్థితుల్లో ఉన్నవారితో అనుసంధానం కావడానికి కూడా ఆన్‌లైన్ వేదికలు ఉపయోగపడతాయని వివరించింది. ప్రస్తుతం ఇంటర్నెట్ పిల్లలకు పూర్తిగా సురక్షితమైన వేదిక కాదని అంగీకరించిన కోర్టు.. ఆ కారణంతో వారిని పూర్తిగా దూరం పెట్టడం పరిష్కారం కాదని స్పష్టం చేసింది. పిల్లలు ఇంటర్నెట్ వాడకూడదని నిబంధనలు విధించినంత మాత్రాన వారు దాని వినియోగాన్ని ఆపరని, నియంత్రణ లేని వెబ్‌సైట్లు, వేదికలకు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఆన్‌లైన్‌లో ప్రలోభాలకు గురైన, బెదిరింపులు ఎదుర్కొంటున్న లేదా వేధింపులకు గురైన పిల్లలు ఇంటర్నెట్ వాడినందుకు తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో జరిగిన విషయాన్ని చెప్పకుండా ఉండొచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించడం తగిన చర్య కాదని పేర్కొంది. పిల్లల వయసుకు తగిన భద్రతా చర్యలను కోర్టు వ్యతిరేకించలేదు. తల్లిదండ్రుల అనుమతి, మార్గదర్శకత్వం, పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. పిల్లల ఖాతాలకు ప్రత్యేకంగా 'చైల్డ్ మోడ్' తీసుకురావడం, ఖాతాలను ముందుగానే ప్రైవేట్‌గా ఉంచడం, తెలియని పెద్దల నుంచి వచ్చే సందేశాలు, పరిచయాలను పరిమితం చేయడం, పిల్లలకు చూపించే ప్రకటనలు, కంటెంట్‌పై నియంత్రణ విధించడం వంటి చర్యలను ప్రస్తావించింది. వీటి అమలుపై తగిన విధానాలను రూపొందించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వానికి వదిలేసింది. పిల్లలకు హానికరమైన అడల్ట్ కంటెంట్ వెబ్‌సైట్ల వంటి నిర్దిష్ట సేవలపై ఆంక్షలు విధించేందుకు ఈ వ్యాఖ్యలు అడ్డంకి కాదని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఆన్‌లైన్ వేదికల్లో పిల్లలపై లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు సమగ్ర జాతీయ డేటాబేస్ ఏర్పాటు సహా చర్యలు

లండన్‌లో మోదీకి ఎన్నారైల భారీ మద్దతు

లండన్‌లోని భారత హైకమిషన్ వెలుపల ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా ప్రవాస భారతీయులు భారీ ప్రదర్శన నిర్వహించారు. త్రివర్ణ పతాకాలను చేతబూనిన వారు 'మోదీ, మోదీ', 'భారత్ మాతా కీ జై', 'జై శ్రీరామ్' వంటి నినాదాలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. విదేశీ గడ్డపై భారత్ ప్రతిష్టకు భంగం కలిగించేలా జరుగుతున్న ప్రచారాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దేశ గౌరవాన్ని కాపాడేందుకే ఇక్కడ సమావేశమయ్యామని వారు స్పష్టం చేశారు. భారత్‌లో ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు (SIR) వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి, 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఈ ప్రదర్శన జరిగింది. ఈసీ తీరును నిరసిస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఐఏఎన్ఎస్‌తో మాట్లాడిన ఓ ప్రవాస భారతీయుడు.. "భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసే వారికి వ్యతిరేకంగా మేము ఇక్కడ సమావేశమయ్యాం. మీకు ఏమైనా సమస్యలుంటే, భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశం. మీరు సుప్రీంకోర్టుతో సహా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఆధారాలు లేకుండా విదేశాల్లో దేశం పరువు తీయడం సరికాదు. కేవలం మోదీ నాయకత్వం, దేశ పురోగతి నచ్చకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు" అని అన్నారు. మరో ప్రవాస భారతీయుడు మాట్లాడుతూ.. "ప్రధాని మోదీ, భారత ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యారు. వారికి పాలించే హక్కు ఉంది. పేదరికం గురించి మాట్లాడేవారు, మోదీ ప్రభుత్వం 300 మిలియన్ల బ్యాంకు ఖాతాలను తెరిపించిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి" అని తెలిపారు. హక్కుల కోసం పోరాడటం వేరు, దేశాన్ని అపఖ్యాతి పాలు చేయడం వేరని మరో వ్యక్తి అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో ప్రవాస భారతీయుల అంతర్జాతీయ సంస్థ 'రీచ్ ఇండియా' కూడా ఈ నిరసనలపై తీవ్రంగా స్పందించింది. "భారత్‌లో విఫలమై, విదేశీ నిధులతో కొందరు దేశంలో అరాచకం సృష్టించాలని చూస్తున్నారు. తల్లిదండ్రుల డబ్బుతో బ్రిటన్‌కు వచ్చిన విద్యార్థులు దేశ వ్యతిరేక శక్తులతో కలవొద్దు. భారత రాజకీయాల గురించి భారత్‌లోనే చర్చిద్దాం" అని 'ఎక్స్' వేదికగా హెచ్చరించింది.

లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



ప్రజాస్ఫూర్తి,భైంసా:పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా సాయం అందిస్తోందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని రైతువేదికలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పథకాల కింద అర్హులైన 102 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వృథాను అరికట్టేందుకు గ్రామాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచులకు సూచించారు. 24 గంటల పాటు బోర్లు నడిచే గ్రామాల్లో సమయపాలన విధించి నీటిని పొదుపుగా వినియోగించేలా చూడాలన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

*** జేఏసీ దీక్షలకు బీసీ సంఘాల మద్దతు**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి) :ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం, బీసీ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు వారు మద్దతు తెలిపారు.ఉద్యోగులకు భద్రత కల్పించి కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. పెండింగ్ వేతన బకాయిలు చెల్లించడంతో పాటు ప్రసూతి సెలవులు, ఈహెచ్‌ఎస్/ఈఎస్ఐ సౌకర్యాలు, ప్రమాద బీమా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు మద్దతు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాటికంటి రవికుమార్, బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి సముద్రాల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి నారగోని ఎల్లస్వామి గౌడ్, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆయుష్‌లో 10 ఉద్యోగాలు.. దరఖాస్తులకు ఆహ్వానం

*** ఈ నెల 23 నుంచి 31 వరకు దరఖాస్తుల స్వీకరణ**

భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):జాతీయ ఆయుష్ మిషన్ కింద జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 10 ఉద్యోగాలను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డా. రాఘవేంద్రరావు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 23 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.ఆయుష్ వైద్యాధికారులు నాలుగు, ఫార్మసిస్ట్ ఒకటి, యోగా శిక్షకుడు ఒకటి, మల్టీ పర్పస్ వర్కర్లు మూడు, సైకోసోషియల్ కౌన్సిలర్ ఒక పోస్టు ఉన్నాయి. వైద్యాధికారులకు నెలకు రూ.40 వేలు, ఫార్మసిస్ట్, మల్టీ పర్పస్ వర్కర్లకు రూ.15 వేలు, యోగా శిక్షకుడికి రూ.28 వేలు వేతనం చెల్లిస్తారు. కౌన్సిలర్‌కు ఒక్కో సందర్శనకు రూ.500 చొప్పున, ఏడాదికి గరిష్ఠంగా 200 సందర్శనలకు చెల్లిస్తారు.2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి. అర్హత, అనుభవ ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో కూడిన దరఖాస్తులను ఈ నెల 23 నుంచి 31 వరకు ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలి.దరఖాస్తులను భూపాలపల్లిలోని కలెక్టరేట్ సముదాయ గ్రౌండ్ ఫ్లోర్, గది నంబరు జి5లో ఉన్న ఆయుష్ విభాగంలో స్వయంగా అందజేయాలని అధికారి సూచించారు. పూర్తి అర్హతలు, నియామక నిబంధనల కోసం సంబంధిత ప్రకటనను పరిశీలించాలని తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

*** మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సం స్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించు కొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సంబరాలను ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి,మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వేడుకల్లో పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో మహిళా ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్య లో హాజరై రంగురంగుల పూలతో బతు కమ్మలను పేర్చి, సంప్రదాయ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బతుకమ్మ పండు గ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత కు, ఐక్యత, సంస్కృతి సంప్రదాయాల కు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాల ను భావితరాలకు అందించడంతో పా టు మహిళల మధ్య ఆత్మీయతను పెం పొందించడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

త్రాగునీటి సరఫరా లో నీటి ప్రెషర్ ను పెంచి

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: త్రాగునీటి సరఫరా లో నీటి ప్రెషర్ ను పెంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం సీఎంసీ కొంపల్లి సర్కిల్ విధాత్రి విల్లాస్ లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విధాత్రి విల్లాస్ వాసులు ,సమీప కాలనీ వాసులు... లో ప్రెషర్ తో త్రాగునీటి సరఫరా అవుతున్నందునా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కొంపల్లి నుంచి విధాత్రి విల్లాస్ కి వచ్చే ప్రధాన రహదారిలో వీధి దీపాలు లేక కాలనీకి వచ్చే వారు చీకట్లలో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, చీకట్లో ప్రధాన రహదారిలో ఇష్టం వచ్చినట్లు చెత్త వేసి వెళ్తున్నారని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనే అభివృద్ధే లక్ష్యమన్నారు. వీధి దీపాలను వెంటనే ఏర్పాటు చేసి ప్రజల అసౌకర్యాన్నితొలగించాలి.రాత్రి వేళల్లో చెత్తను డంప్ చేయకుండా పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విధాత్రి విల్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కొంపల్లి మున్సిపల్ డీసీ లావణ్య, మాజీ చైర్మన్ సన్న కవితా శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితా శ్రీశైలం యాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి, నాయకులు పూజారి లక్ష్మణ్ గౌడ్, క్రిష్ణ సాగర్, షన్ను భాయ్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పేరుతో కార్మిక సంఘాల కార్యాలయాల కూల్చివేత విరమించుకోవాలి

*** ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు అంబాల చంద్రమౌళి మాదిగ**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): అభివృద్ధి పేరుతో కార్మిక సంఘాల కార్యాలయాలను కూల్చే ప్రయత్నాలను విరమించుకోవాలని ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు అంబాల చంద్రమౌళి మాదిగ డిమాండ్ చేశారు. శనివారం భూపాలపల్లిలోని టీఎస్ఈయు కార్యాలయంలోనిర్వహించినవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ సెంటర్ నుంచి కృష్ణ కాలనీ వరకు 200 అడుగుల రోడ్డు నిర్మాణ ప్రతిపాదనతో సింగరేణి ఉద్యోగుల సంఘం సహ టీఎస్ఈయు, బీఎంఎస్, టీజీబీకెఎస్ కార్యాలయాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇతర ప్రాంతాల్లో 70 నుంచి 100 అడుగుల రహదారులు ఉన్నప్పుడు ఇక్కడ 200 అడుగుల రోడ్డు అవసరమేంటని ప్రశ్నించారు. కార్మిక సంఘాల కార్యాలయాలు అభివృద్ధికి అడ్డంకులు కావని స్పష్టం చేశారు.గతంలో ప్రజా సమస్యలపై పోరాడిన ఎమ్మెల్యే కార్మిక సంఘాల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో కలిసి కార్యాలయాల కూల్చివేతను నిలిపివేయాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీనిపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, ఎమ్మెల్యేతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ నాయకులు దోర్నాల రాజేందర్ మాదిగ, అంతడుపుల సురేష్ మాదిగ, చంటి మాదిగ, మెరుపటి అశోక్ మాదిగ, దోర్నాల భరత్ మాదిగ, బోనపాకల కుమార్ మాదిగ,కొప్పుల సతీష్‌మాదిగ, కల్లపల్లి తిరుపతి మాదిగ, సదరం రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కారం చేయకుంటే ధర్నాలతో పోరాటమే



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:రాష్ట్రంలో విద్యుత్ సమస్యలతో రైతులు, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, అవి తీర్చకుంటే ప్రజల పక్షాన నిలబడి ధర్నాలతో పోరాటం చేస్తామని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి హెచ్చరించారు. జన్నారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో బి ఆర్ ఎస్ పార్టీ శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం రాకముందే విద్యుత్ ప్రతిరోజు పలుసార్లు పోయి ప్రజలు, రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రోజు నిరంతరంగా విద్యుత్తును సరఫరా చేసిందని, ఈ ప్రభుత్వం విద్యుత్తును సరఫరా చేయకుండా ప్రజలను రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికలకు ముందు విద్యుత్ నిరంతరం సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, గెలిచిన అనంతరం విద్యుత్ సమస్యను ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. విద్యుత్ సమ సమస్యలను పరిష్కారం చేయకుంటే ,స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ ముట్టడిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సిటిమల్ల భరత్ కుమార్, ఫజల్ఖాన్, జాడి గంగాధర్, రెడ్డి, సాయి, సులువ జనార్ధన్, రాములునాయక్, గంగాధర్, ప్రభుదాస్, మున్వర్ అలీఖాన్,రాకేష్,నర్సాగౌడ్,సాయి, జంగం రవి, అడవు లక్ష్మీనారాయణ, చిటుమల్ల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

కరువు పరిస్థితుల్లో తక్కువ నీటితో పండే పంటలు సాగు చేయాలి

*** ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్**



ప్రజాస్ఫూర్తి,భైంసా:పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను దసరా పండుగ కానుకగా 68 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కుంటాల మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాయకులు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు,ఎలినో ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు విద్యుత్ సమస్యలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్యాకేజీ పనులు పూర్తయితే రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గి వ్యవసాయానికి మేలు జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం కార్యక్రమానికి హాజరైన మహిళలకు, లబ్ధిదారులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ వేళ ఆర్థిక సాయం అందడం పేద కుటుంబాలకు ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమన్వయ చర్యలు

: డా.టీ.కే.శ్రీదేవి



జనగామ, ప్రజాస్ఫూర్తి : వర్షాభావ పరి స్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు స మన్వయంతో పనిచేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, మున్సి పల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి డా. టీ.కే.శ్రీదేవి సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, సాగు నీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా పై సమీ క్షించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, అక్టోబర్ 17 నాటికి జిల్లాలో 5 22 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది,సాధారణ వర్షపాతంతో పోలిస్తే 28 శాతం లోటు ఉందని తెలిపారు. జిల్లాలోని ఏడు మండలాలు వర్షపాతం లోటును ఎదుర్కొంటున్నాయని, రఘునాథ పల్లి మండలంలో అత్యధికంగా 52 శా తం లోటు నమోదైందని వివరించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరి సాగును తగ్గించి, నూనెగింజలు, పప్పు ధాన్యాల వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 12 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత పదేళ్ల సగటుతో పోలి స్తే 38 శాతం తక్కువగా ఉన్నాయని తెలిపారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని,తా గునీరు, సాగునీరు,విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీలం మధు ముదిరాజ్‌కు ఎమ్మెల్సీ పదవి కల్పించాలి



గుమ్మడిదల,(ప్రజాస్ఫూర్తి): పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం అందిస్తున్న నీలం మధు ముదిరాజ్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలని గుమ్మడిదల మండల ముదిరాజ్ సంఘం కార్యదర్శి, ఎన్ఎంఆర్ యువసేన సీనియర్ నాయకుడు బుద్దుల అశోక్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలపై స్పందిస్తూ, వివిధ వర్గాల వారికి సహాయ సహకారాలు అందిస్తున్న నీలం మధు ముదిరాజ్‌కు సముచిత గుర్తింపు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి కల్పిస్తే భవిష్యత్తులో పేద ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఉంటుందని అశోక్ ముదిరాజ్ అభిప్రాయపడ్డారు.

ఎల్‌నినో ముప్పుపై కళాజాతతో అవగాహన

*** ఆరుతడి పంటల సాగుతో కరువు ప్రభావాన్ని తగ్గించుకోవాలి**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, కరువు పరిస్థితులు, వ్యవసాయంపై వాటి ప్రభావంపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, డీపీఆర్వో శ్రీనివాస్ ఆదేశాల మేరకు శనివారం కాటారం మండలం కొత్తపల్లి గ్రామంలో సెగ్గం శిరీష కళాబృందం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, పెసలు, మినుములు, నువ్వులు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని కళాకారులు సూచించారు. నీటి లభ్యత, నేల స్వభావం, వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకొని సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని, అధిక పెట్టుబడులతో నష్టపోకుండా వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. పశువులకు తగినంత తాగునీరు అందించాలని పేర్కొన్నారు.పాటలు, మాటలు, కళారూపాల ద్వారా ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సెగ్గం శిరీష, పులి రాధిక, కాస స్వాతి, ఆత్మకూరి మహేందర్, కమ్మల ప్రవీణ్ కుమార్, ఒనపాకల కుమార్ పాల్గొన్నారు.

హేమాజీపూర్ బస్సు పునరుద్ధరించండి

*** ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి..**



ప్రజాస్ఫూర్తి, షాద్‌నగర్: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఫరూక్ నగర్ మండలం చింతగూడ మీదుగా హేమాజీపూర్ వరకు నడిచే బస్సును పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ తెలిపారు. గతంలో సాయంత్రం 4:30 కి ఈ బస్సు నడిచేది. కోవిటి సమయంలో రద్దు చేశారు. ఆ తర్వాత పునరుద్ధరించలేదు. కాగా శుక్రవారం బూర్గుల గ్రామంలో జరిగిన సమావేశంలో చింతగూడ గ్రామ ప్రజలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను బస్సు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అక్కడికక్కడే డిపో మేనేజర్ తో మాట్లాడి బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలోనే గ్రామ సర్పంచ్ రాజగోపాల్ ద్వారా మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ డిపో మేనేజర్ కు శనివారం వినతిపత్రం ఇప్పించారు. ఎమ్మెల్యే శంకరన్న అండతో తప్పనిసరిగా బస్సు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి,భైంసా:నిర్మల్ జిల్లా తానూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ తాడేవార్ విఠల్ సోదరుడు, బోల్సా గ్రామానికి చెందిన పోతన్న సోదరుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్ శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, మండల అధ్యక్షుడు హెచ్. పుండలిక్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ డి. రాములు, శెట్టి పటేల్, గోవింద్ పటేల్, బషీర్, మండల ఎస్సి విభాగం అధ్యక్షుడు పవార్ సాయినాథ్, సర్పంచ్ శివరాం చంద్రే, అంబేకర్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ముస్తాబాద్ మండల మహిళా మోర్చ అధ్యక్షురాలుగా కరెడ్ల సునంద



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బీజేపీ ముస్తాబాద్ మండల మహిళా మోర్చ అధ్యక్షురాలుగా చీకోడ్ గ్రామానికి చెందిన 2వ వార్డు మెంబర్ కరెడ్ల సునంద నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ ఆమెను నియమిస్తూ శనివారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. తనను బీజేపీ ముస్తాబాద్ మండల మహిళా మోర్చ అధ్యక్షురాలుగా నియమించినందుకు బీజేపీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్‌కు సునంద కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ పార్టీ బలోపేతం, మహిళా మోర్చ సంబంధించిన కార్యక్రమాల్లో మరింత ఉత్సాహభరితంగా పని చేస్తూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

యూత్ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి



: ఎలబోయిన హరీష్.

*** ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వాలని జిల్లా కేంద్రంలో బీజేవైఎం నిరసన.**

ప్రజాస్ఫూర్తి, జనగామ : కాంగ్రెస్ ప్రభు త్వం యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హా మీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జనగామ ఆర్టీసీ చౌరస్తాలో బీజే వైఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎల బోయిన హరీష్ మాట్లాడుతూ, ఏడాది లో రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామ ని, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరు ద్యోగ యువతను ఇబ్బందులకు గురిచే స్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెం టనే స్పందించి యూత్ డిక్లరేషన్ హామీ లను నెరవేర్చాలని, నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మిషన్ వాత్సల్య పోస్టులకు ప్రశాంతంగా రాత పరీక్ష

*** 69 మంది దరఖాస్తు.. 58 మంది అభ్యర్థుల హాజరు**



ప్రజాస్ఫూర్తి, జనగామ: జనగామ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మిషన్ వాత్సల్య పథకం కింద బాలికల ప్రభుత్వ శిశు గృహంలో ఆరు అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి శనివారం రాత పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 69 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 58 మంది హాజరయ్యారు. మరో 11 మంది గైర్హాజరయ్యారు. కౌన్సిలర్, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్, స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్, పారామెడికల్ సిబ్బంది, అటెండర్, సేవిక పోస్టుల భర్తీ కోసం పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, జిల్లా ఉపాధి అధికారి కుమారస్వామి తదితరులు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.

అధికారులు సమన్వయంతో
ట్రాఫిక్, పార్కింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి,భైంసా:పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. వ్యాపార సముదాయాలకు తప్పనిసరిగా పార్కింగ్ సదుపాయం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్లపై ఆక్రమణలు, పశువుల సంచారం, ఇసుక అక్రమ రవాణా తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.పార్కింగ్ సదుపాయం లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వ్యాపార సముదాయాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై పశువులను వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పశువుల కారణంగా ప్రమాదాలు, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే యజమానులకు జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే పశువులను స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారులు, మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించాలని అధికారులను ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను 'బ్లాక్ స్పాట్లు'గా గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన హెచ్చరిక బోర్డులు, ఇతర భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల వెంట నిబంధనలకు విరుద్ధంగా,ప్రమాదకరంగా భారీ వాహనాలను నిలిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలు (వీడీసీ) ఇసుక వేలం నిర్వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వీడీసీలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

*** డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం ఎస్పీ**

జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వివిధ కేసుల్లో బాధితులకు అందాల్సిన నష్టపరిహారాన్ని త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రత్యేక పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'భూభారతి', 'సీఎం ప్రజావాణి'లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవరావు,ఏఎస్పీలు సాయికిరణ్, ఉపేంద్రా రెడ్డి, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు, వృద్ధులకు
భోజనం పెట్టి ఆకలి తీర్చడం ఎంతో తృప్తినిస్తుంది

*** లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు లయన్.డాక్టర్. చిల్లా రాజశేఖర్ రెడ్డి.**



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: ఆశ్రమాలలో ఉన్న నిరాశ్రయులకు, వృద్ధులకు భోజనం పెట్టి ఆకలి తీర్చడం ఎంతో తృప్తిని ఇస్తుందని లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు,రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ అధినేత,ప్రముఖ పారిశ్రామికవేత్త లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు.శనివారం ఆయన తండ్రి విశ్రాంత ఉపాధ్యాయులు స్వర్గీయ చిల్లా నారాయణరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా జగద్గిరిగుట్ట పరిధి ఆల్విన్ కాలనీలోని రాజేశ్వరి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ఏర్పాటు చేశారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రయం లేని వారికి వృద్ధాశ్రమమే ఆసరాగా ఉంటూ మనోధైర్యాన్నిస్తుందని మానవసేవయే మాధవ సేవగా భావిస్తూ ఎన్నో ఏళ్లుగా పేదప్రజలకు వృద్ధులకు,నిరాధారణకు గురైన వికలాంగులకు,పేద విద్యార్థులకు తన వంతు బాధ్యతగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. ఆశ్రమ అభివృద్ధి కోసం తన వంతు సహకారాలు అందజేస్తారని పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తారని పేర్కొన్నారు. రాజేశ్వరి వృద్ధాశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరి మాట్లాడుతూ ఎంతోమంది దాతలు,స్వచ్ఛందసంస్థలు ముందుకు వచ్చి ఆశ్రమ నిర్వహణ కోసం సహాయ సహకారాలు అందజేస్తూ మానవత్వాన్ని చాటుకున్న వారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.శాశ్వత వృద్ధాశ్రమ భవన కోసం ప్రభుత్వం,ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రగతి ఉపాధ్యక్షులు లయన్. విష్ణువర్ధన్ రెడ్డి,మానస టూల్ టెక్ అధినేత,కవి వాకిటి రామిరెడ్డి, పారిశ్రామికవేత్తలు జింకల వెంకటేష్ ముదిరాజ్,కాట్రెడ్డిరమణారెడ్డి,హేమాద్రి నాయుడు,వృద్ధాశ్రమ సహాయకురాలు టి.శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

కన్నీరు తుడిచిన కాంగ్రెస్ హస్తం
అనాథ చెల్లికి అన్నయ్యగా మారిన నాయకుడు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: కన్నవారిని కోల్పోయి, నాయనమ్మ ఆసరాతోనే పెరిగిన ఆ బాలికకు,ఆ ఒక్క ఆసరా కూడా లేకుండా పోయింది. కాట్రపల్లికి చెందిన బొద్దుల అఖిల,చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయింది. నాయనమ్మ స్వరాజ్యం ఎన్నో కష్టాలు పడి,ఆమెను పెంచి పెద్ద చేసింది.అఖిల చదువులో రాణించి,కాట్రపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ప్రథమ శ్రేణిలో పాసై, ప్రస్తుతం వరంగల్ లోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో చదువుతోంది. ఇలాంటి సమయంలో, నాయనమ్మ మరణించడంతో ఆమె అనాథగా మిగిలింది.ఈ విషయం తెలుసుకున్న కేసముద్రం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్,వెంటనే గ్రామానికి చేరుకున్నారు. "నువ్వు ఒంటరిదానివి కాదు, నీకు అన్నగా నేనున్నా,నీ చదువు బాధ్యత నాది" అంటూ భరోసా ఇచ్చారు. వెంటనే ఆకుటుంబానికి ఒక క్వింటాల్ బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసి, అంత్యక్రియలలో కూడా పాల్గొని మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రు నాయక్ మాట్లాడుతూ,ధనం ఉంటే సరిపోదని,ఆపదలో ఆదుకునే గుణం ఉండాలని, సమ్మయ్య గౌడ్ సేవలు అభినందనీయమని అన్నారు.గ్రామస్థులు, సర్పంచ్ ఎదురబోయిన సురయ్య మాట్లాడుతూ, మండలంలో ఏ పేద ఇంట్లో కష్టం వచ్చినా, సమ్మయ్య గౌడ్ అండగా ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ షాగంటి యాదగిరి,సామల నర్సయ్య,సిరికొండ మల్లయ్య,పుట్ట ప్రభాకర్,జాటోత్ లక్ష్మణ్,రుద్ర యాదగిరి,దాసరి శ్రీనివాస్,బేతూ సత్యం,సాంబారి వీరాస్వామి, కర్పూరపు వెంకటేశ్వర్లు, నల్లగొప్పుల సాయిలు,బోదాసు చంద్రయ్య,సిరికొండ వెంకన్న,అడప రవీందర్,ఓర్సు ముత్తయ్య,నాయిని స్వామి,యెడల్లి దేవరాజు,దేవులపల్లి కట్టయ్య,జినుకల శ్రావన్, నూణావత్ మాను,పాలికోజు భీష్మచారి,కాంగ్రెస్ పార్టీ పెద్దలు,పద్మశాలి కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్ కాలనీలో బతుకమ్మ వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

*** సీఐ రాయల వెంకటేశ్వర్లు**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరుపుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో విద్యానగర్ కాలనీలోని బతుకమ్మ ఘాట్‌ను పోలీస్ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది కలిసి సందర్శించి పరిశీలించారు.బతుకమ్మ వేడుకలు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఘాట్ వద్ద ఉన్న పరిస్థితులను పరిశీలించారు. మహిళలు, చిన్నారులు, ప్రజలు సురక్షితంగా పండుగలో పాల్గొనేలా భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, ప్రజల రాకపోకలకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా సిఐ రాయల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పండుగ సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయడం ప్రాధాన్యమని ,ప్రజల భద్రతే లక్ష్యంగా.. బతుకమ్మ సంబరాలు సజావుగా సాగేందుకు పోలీస్, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి , ఎస్సై రవికుమార్ , గ్రామపంచాయతీ ఈవోకె..వెంకటేశ్వర్లు ,పంచాయతీ బిల్ కలెక్టర్ రామకృష్ణ ,పోలీస్ ,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు .

జగద్గిరిగుట్టలో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జగద్గిరిగుట్ట దుర్గా భవాని అసోసియేషన్ సభ్యులు చిన్న, దేవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దుర్గా భవాని అమ్మవారి పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీజేపీ యువ నాయకులు ఆర్థిక్ యాదవ్, మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి గండి రాజు యాదవ్ లు పాల్గొని ప్రత్యేక పూజలుచేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, సాయి ముదిరాజ్, బబ్లు, రాజేష్, నాని తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

భక్తిశ్రద్ధలతో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



కుత్బుల్లాపూర్ ,ప్రజాస్ఫూర్తి: దేవి శరన్నవరాత్రుల పవిత్ర పర్వదినాలను పురస్కరించుకొని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర నగర్, గణేష్ నగర్, డీ నగర్ (చింతల్), ద్వారకా నగర్, అంబేద్కర్ నగర్ , రాఘవేంద్ర కాలనీలలో కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి అమ్మవారి మండపాలను సందర్శించి, 7వ రోజు శ్రీ లక్ష్మీదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, సమాజంలో సుఖశాంతులు, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబంపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని వేడుకొన్నారు. అనంతరం సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొంతపల్లి వీరభద్ర నగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిల్లాలో ఆర్థిక పథకాల పై ప్రత్యేక శిబిరాలు

*** అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహణ.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ప్రజల కు బ్యాంకింగ్, బీమా, పెన్షన్ సేవలను మరింత చేరువ చేసేందుకు అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) ప్రతి భ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, పట్ట ణ స్థానిక సంస్థల పరిధిలో ఈ శిబిరాల ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరాల్లో బ్యాంకు ఖాతాల ప్రారంభం, బీమా, పెన్షన్ పథకాలలో నమోదు, కే వైసీ పూర్తి, ఆధార్ అనుసంధానం, నా మినీ వివరాల నమోదు వంటి సేవలు అందించడంతో పాటు డీఈఏ ఫండ్‌పై అవగాహన కల్పించనున్నారు. అలాగే డిజిటల్ మోసాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అర్హులైన ప్రజ లందరూ ఈ ప్రత్యేక శిబిరాలను సద్వి నియోగం చేసుకొని, ప్రభుత్వ ఆర్థిక పథకాల ప్రయోజనాలు పొందాలని ఎల్‌డీఎం ప్రతిభ కోరారు.

భూముల రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

*** అవగాహన సదస్సులో కరీంనగర్ ఏడి కిషన్ రావు...**



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే కార్యక్రమంలో భాగంగా శనివారం చిగురుమామిడి మండలంలోని ముదిమాణిక్యం, రామంచ గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచులు బోయిని రమేష్, ఒంటెల కిషన్ రెడ్డిల అధ్యక్షతన రైతన్నలకు శనివారం అవగాహన సదస్సులను నిర్వహించారు.ఈ సమావేశాలకు కరీంనగర్ ఏడి కిషన్ రావు,తహశీల్దార్ కనుకయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఏడి కిషన్ రావు మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో భాగంగా మొదటగా గ్రామ సరిహద్దులను, ప్రభుత్వ భూములను, రాస్తాలను, కెనాల్స్, ఇతర శాఖల భూముల హద్దులను గుర్తిస్తామని తెలిపారు.అనంతరం ప్రతి రైతు సమక్షంలో అత్యాధునిక అక్షాంశాలు, రేఖాంశాలతో కూడిన డిజిటల్ కొలతలు నిర్వహిస్తామన్నారు. రైతుల నుండి ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నెంబర్లను సేకరించి, ప్రతి భూమికి ఒక తాత్కాలిక నెంబర్,భవిష్యత్తులో శాశ్వత భూ ఆధార్ కార్డును జారీ చేస్తామని వివరించారు. రికార్డులకు, క్షేత్రస్థాయి విస్తీర్ణానికి ఏవైనా తేడాలుంటే నోటీసులు జారీ చేస్తామని,నోటీసు అందిన 60 రోజులలోపు టైటిల్ పత్రాలతో అప్పీల్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.తహశీల్దార్ కనుకయ్య మాట్లాడుతూ ఈ భూముల రీ సర్వే వల్ల భవిష్యత్తులో భూ ఆక్రమణలను సులభంగా పసిగట్టవచ్చని,రైతులు సర్వే ఆఫీసుల చుట్టూ తిరిగే తిప్పలు తప్పుతాయని తెలిపారు.రాబోయే మూడు నెలల్లో ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు రైతులందరూ సర్వేసిబ్బందికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. తమ గ్రామాలను ఈ ప్రాజెక్ట్ కోసం ముందుగా ఎంపిక చేసినందుకు సర్పంచులు ప్రభుత్వం, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిఐ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి తాటిపెల్లి పున్నంచందర్ రెడ్డి,మండల సర్వేయర్ బాలమురళీ కృష్ణ, ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి,ఏఈఓ ప్రణయ్, స్థానిక ప్రజాప్రతినిధులు,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

గాంధీ కాలనీలో దుర్గామాతను దర్శించుకున్న ఉపసర్పంచ్



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : రామాం జనేయ కాలనీ గ్రామపంచాయతీ లో గల గాంధీ కాలనీ లో ఏర్పాటు చేసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాంధీ కాలనీలో కొలువుదీరిన దుర్గామాతను రామాంజనేయ కాలనీ ఉపసర్పంచ్ కోడూరి నాగేష్ భక్తిశ్రద్ధలతో దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు సమర్పించారు.దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఆలయ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అందిస్తున్న సేవలను అభినందించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో గాంధీ కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో దుర్గామాత మండప కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు .

రేకొండలో బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పరిశీలించిన ఎంపిడిఓ రామ్మోహన్ చారి..



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి:తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ,దసరా పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో,సంతోషంగా జరుపుకునేలా రేకొండ గ్రామంలోని బతుకమ్మ ఘాట్ వద్ద ముందస్తు ఏర్పాట్లను అధికారులు,ప్రజాప్రతినిధులు శనివారం ఉమ్మడిగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో చిగురుమామిడి ఎంపిడిఓ రామ్మోహన్ చారి,ఎంపీఓ కిరణ్ కుమార్,రేకొండ గ్రామ సర్పంచ్ అల్లెపు సంపత్,ఉపసర్పంచ్ బిల్లా సంతోష్ రెడ్డి,గ్రామపంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్ పాల్గొని పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు బతుకమ్మలు ఆడుకునే స్థలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైటింగ్,తాగునీరు, పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.చెరువులు,ఘాట్ల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామంలోని ప్రజలందరూ ఈ పండుగను ప్రశాంత వాతావరణంలో వైభవంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

హత్నూర మండలంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు



హత్నూర, ప్రజాస్ఫూర్తి:సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని పలు గ్రామాల్లో బతుకమ్మ పండుగను ఆడపడుచులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి,సంప్రదాయ దుస్తులు ధరించి మహిళలు, చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు.బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాల్లోని చెరువు కట్టలు, బతుకమ్మ ఘాట్లను గ్రామ పంచాయతీ పాలకవర్గాలు ముందస్తుగా చదును చేయించాయి. పండుగకు వచ్చే మహిళలు సౌకర్యవంతంగా బతుకమ్మలను ఆడుకునేలా ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహిళలు, చిన్నపిల్లలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు.

దుర్గమాత వద్ద పెద్ద ఎత్తున మహా అన్నప్రసాదం ఏర్పాటు

*** ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ అకవరం భవాని శివప్రసాద్...**



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి:మండల కేంద్రంలోని శ్రీరామాలయంలో ఏర్పాటు చేసిన దుర్గ మాత సన్నిధిలో చత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో శనివారం మహాఅన్నప్రసాద కార్యక్రమంను అత్యంత ఘనంగా నిర్వహించారు.గడ్డం సురేందర్ రెడ్డి,మంజుల అన్నదాతలుగా వ్యవహరించి వితరణ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ చత్రపతి శివాజీ యువసేన సభ్యులు ఇలాంటి దైవకార్యాలు, సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు.అన్నదాతల ఉదారత్వాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు.దుర్గ మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో దుర్గ మాత ఉత్సవ కమిటీ సభ్యులు, చత్రపతి శివాజీ యువసేన ప్రతినిధులు,ఆలయ అర్చకులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మహిళల సంబురానికి శాశ్వతే చిరునామా

*** మున్నేరు వాగు చెంత నూతన ఘాట్ కు భూమి పూజ**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలోని 16వ వార్డు, ఏటిగడ్డ తండా సమీపంలోని మున్నేరు వాగు వద్ద, రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం 16వ వార్డు కౌన్సిలర్ బానోత్ పద్మ సీతారాం నాయక్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ మాట్లాడుతూ,తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు సౌకర్యవంతంగా జరుపుకునేందుకు ఈ ఘాట్ ఉపయోగపడుతుందని అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గూగులోతు జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ మహిళల సౌకర్యాలే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని,బతుకమ్మ ఘాట్ తో ఆడబిడ్డలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగను ఘనంగా జరుపుకోవచ్చని అన్నారు.వార్డు అభివృద్ధికి మున్సిపాలిటీ అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు.వార్డు కౌన్సిలర్ బానోత్ పద్మ సీతారాం నాయక్ మాట్లాడుతూ 16వ వార్డు ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని,ఈ ఘాట్ నిర్మాణం వార్డు అభివృద్ధిలో కీలక అడుగు అని అన్నారు. పట్టణ అభివృద్ధి కోసం ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.350 కోట్లు, తాగునీటికి రూ.20 కోట్లు, సీసీ రోడ్లకు రూ.69 కోట్లు, విద్యారంగానికి రూ.100 కోట్లు కేటాయించామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుర్నపు సోమయ్య, మున్సిపాలిటీ కమిషనర్ వినోద్ కుమార్, డి ఈ ఉపేందర్, ఏ ఈ కుమార్,15వ వార్డు కౌన్సిలర్ బానోత్ బాబు,2వ వార్డు కౌన్సిలర్ అంబాల శివ,3వ వార్డు కౌన్సిలర్ కొరవి రాజీత, బోళ్ల రాజు,పద్మం ప్రవీణ్, నిమ్మల శ్రీను,ఎడ్ల రమేష్,ఖలీల్,గుగులోత్ వెంకట్, సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి రావుల రాజు,ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

నిజాంపేటలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: నిజాంపేట్ సర్కిల్ నిజాంపేట గ్రామంలో వెలిసిన కనకదుర్గమ్మ అమ్మవారి దేవీ నవరాత్రులలో భాగంగా శనివారం చండీ అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకున్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంతరెడ్డి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి వారికి స్వాగతం పలుకారు. అనంతరం సత్యం పంతులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి శేసనస్తుముతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సత్యం పంతులు వేద ప్రవచనాల మధ్య అమ్మవారి దేవీ నవరాత్రి ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఇక్కడి నవరాత్రి ఉత్సవాలను చూస్తూ ఉంటే బెజవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను చూసినట్లు ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో ఉండాలన్నారు. అమ్మవారి దయానుగ్రహంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడి పాడిపంటలతో సమృద్ధిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గ్రామ పెద్దలు కొలన్ లీడర్ నరసింహారెడ్డి,మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రావూరి మల్లేశ్వరరావు, నిజాంపేట సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, 275వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసు పరగాని 276వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి (తాతిరెడ్డి), గాజులరామారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు టేకుల ప్రవీణ్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, కొలన్ లక్ష్మారెడ్డి, ఏలూరి సత్య నాని, లక్ష్మణ్, ప్రశాంత్ రెడ్డి, రాజు, కృష్ణ, నాయుడు, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జనగణన2027 నిర్వహణకు ప్రత్యేక శిక్షణ



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): దేశాభివృద్ధికి సమగ్ర సమాచారం కీలకమని, భవిష్యత్తు ప్రణాళికలకు అదే పునాది అని సీపీఓ ఎం.కిష్టయ్య అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు జనగణన2027 రెండో దశ సన్నాహాల్లో భాగంగా సెన్సస్ కరస్పాండెంట్లు, సాంకేతిక సహాయకులకు ఈ నెల 16, 17 తేదీల్లో కలెక్టరేట్‌లో రెండు రోజుల ప్రత్యేక శిక్షణ నిర్వహించారు.శిక్షణలో జనగణనకు ముందస్తు ఏర్పాట్లు,స్వీయ గణన విధానం,ప్రశ్నావళిలోని 1 నుంచి 40 ప్రశ్నలకు సంబంధించి ప్రజల నుంచి కచ్చితమైన సమాచారం సేకరించే విధానాలపై అవగాహన కల్పించారు. జనగణనను సమర్థవంతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వర్తించాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.కార్యక్రమంలో సహాయ సెన్సస్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ఇన్‌చార్జి శిక్షకుడు ఆడెపు వినయ్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ బోయిని శివకుమార్, మండలాల ఎంఓఎస్ఓలు, గణన సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

కనకం చిన్న గురవయ్య మృతి

*** పలు పార్టీల నాయకుల నివాళులు**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి :ఖమ్మం జిల్లా కూసుమంచి గ్రామానికి చెందిన కనకం చిన గురవయ్య (85) మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తుల్లో విషాదం నెలకొంది. చిన గురవయ్య మృతి విషయం తెలుసుకున్న పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కనకం చిన గురవయ్య మనవడు ఆకారపు రవిచంద్ర రాజకీయ, విద్యార్థి ఉద్యమ రంగాల్లో గుర్తింపు పొందారు. గతంలో పీడీఎస్‌యూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన రవిచంద్ర, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అనుచరుడిగా ఉన్నారు.తాత కనకం చిన గురవయ్య మృతి రవిచంద్ర కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తూ, మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్న నలంద ఫౌండేషన్ చైర్మన్ కపిల్ వాగ్మారే



ప్రజాస్ఫూర్తి.భైంసా: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.నిర్మల్ జిల్లా వానల్‌పాడ్ ప్రాంతంలో దుర్గామాత అమ్మవారిని నలంద ఫౌండేషన్ చైర్మన్ కపిల్ వాగ్మారే భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నలంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు వాగ్మారే కపిల్ కు సభ్యులు వాగ్మారే సిద్ధోధన్ లకు అమ్మవారి ప్రతిమను అందజేసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో. ఆలయ కమిటీ సభ్యులు భోజనం పటేల్, గౌరోళ్ల రాహుల్,మాజీ సర్పంచ్ ముత్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామగిరిలో బతుకమ్మ తల్లి విగ్రహానికి ప్రాణం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:శ్రీరామగిరి గ్రామంలో బతుకమ్మ తల్లి విగ్రహాన్ని గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళీ నాయక్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయానికి ప్రతీక అని అన్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే విధంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు భూక్యా ఉమా మురళీ నాయక్,మాజీ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్,డీసీసీ మాజీ ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్,వివిధ గ్రామాల సర్పంచులు బాలకృష్ణ,దేవేందర్, ఇట్టే లీలా,నల్లగుట్ట తండా సర్పంచ్ శ్రీనివాస్,సుమన్, బెల్లి నరసయ్య, ధోనికాని మల్లయ్య, మద్దెల సమ్మయ్య,ఆవుల వెంకన్న,స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ ని నో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం


*** ఎల్లమ్మ చెరువు బతుకమ్మ సంబరాల ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్.**



హుస్నాబాద్,ప్రజాస్ఫూర్తి:ప్రకృతి వైపరీత్యాలు ఎల్ నినో ప్రభావాన్నితట్టుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని,వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకోవాలని,దీనిపై ప్రతిపక్షాలు అనవసరపు ప్రచారాలు చేయొద్దని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను బతుకమ్మ వేడుకల పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్లాస్ బ్రిడ్జి, కప్పగుట్ట పర్యాటక అభివృద్ధి, అర్బన్ ఫారెస్ట్ పార్క్ ఏర్పాటు వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు.గౌరవెల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు కాలువలకు సంబంధించిన భూసేకరణ పనులు కొనసాగుతున్నాయని, భూసేకరణ పూర్తయిన వెంటనే కాలువల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎంఎంఆర్ ప్యాకేజీ కింద కూడా పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, ఈ అంశాలపై కేబినెట్‌లో కూడా చర్చించినట్లు తెలిపారు. ఈ సమయంలో రాజకీయాలకు అతీతంగా రైతులకు అండగా నిలవాలని అన్ని వర్గాలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట సీపీ రశ్మిపెరుమాళ్,మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి,వైస్ చైర్మన్ చిత్తారి పద్మ,గ్రంథాలయ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి,సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిత్తారి రవీందర్,పట్టణ అధ్యక్షులు వివి రమణ వివిధ గ్రామాల సర్పంచులు కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

*** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కలెక్టర్లకు సూచన**



భువనగిరి, ప్రజా స్ఫూర్తి: ఎస్ఐఆర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, తదితర అంశాలపై హైదరాబాదు నుంచి రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారంసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న విచారణలను త్వరితగతిన పూర్తి చేసి, అవసరమైన వారికి నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలను సకాలంలో చేపట్టాలని సూచించారు.ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు. ఓటర్ల అర్హతలను నిర్ధారించే సమయంలో సంబంధిత పత్రాలను జాగ్రత్తగా పరిశీలించి, అర్హులైన వారికి సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చూడాలని తెలిపారు.ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు, అనర్హమైన నమోదు (లేదా) డూప్లికేట్ వివరాలు లేకుండా బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.ప్రతి బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని దరఖాస్తులు, ఓటర్ల వివరాలకు సంబంధించిన రికార్డులను భౌతిక పత్రాల రూపంలో సక్రమంగా నిర్వహించి, భవిష్యత్తు అవసరాల కోసం భద్రపరచాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదును భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ దరఖాస్తులను ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో క్షుణ్ణంగా పరిశీలించి, నకిలీ, తప్పుడు, డూప్లికేట్ దరఖాస్తులు లేకుండా అర్హతలను నిర్ధారించాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూఫారం6, ఫారం7, ఫారం 8 లకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిశీలించి, పెండింగ్ లేకుండా చూడాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, ఎలక్షన్ సూపర్ డెంట్ కృష్ణ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

ఎల్ నినో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

*** కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ఎల్ నినో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో రానున్నరోజుల్లో తాగునీరు, విద్యుత్, సాగునీరు, వి. బి. జీ రాంజీ ఉపాధి హామీ పనులు, భూగర్భాల అవసరాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపకల్పన పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి లు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ భూగర్భ జలాలు రాను రాను తగ్గుతుండడంతో రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్, అవసరాలకు సంబంధించి గ్రామ సభలలో సర్పంచుల అధ్యక్షతన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలన్నారు.తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.వ్యవసాయ అధికారులు సూచన మేరకు రైతులు వరి వేయవద్దని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు మండలాల వారీగా నీటి వనరుల లభ్యత ఆధారంగా పంటలు సాగు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులతో నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, జలసిరి,వీబీజీ రామ్ జీ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి బోర్ వెల్ రీఛార్జి గుంతలు, పామ్ పాండ్, మ్యాజిక్ సోక్ పిట్ తదితర పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ, ఈ ఈ పంచాయతీ రాజ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని, యంత్రాలు ఇతర ఏర్పాట్లు ఇప్పటి నుంచే సరి చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆయా మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీలకు అవసరమైన నీటిని సరఫరా చేయాలన్నారు. ఎన్ పీడీసీఎల్ అధికారులు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు అవసరమైన నీటి తొట్టిల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీ ఈ ఓ శోభా రాణి,జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీనాభవృద్ధి అధికారి నాగిరెడ్డి , డిప్యూటీ కమీషనర్ సరిత,డీపీఓ శ్రీనివాస్ రెడ్డి,రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జానయ్య, ఈఈ పీఆర్, మిషన్ భగీరథ, నీటి పారుదల శాఖ, మండల తహసీల్దార్, ఎంపిడిఓ, మండల స్పెషల్ ఆఫీసర్,తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ప్రజాస్ఫూర్తి,భైంసా:జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం రాత్రి బతుకమ్మ వేడుకలు కన్నుల పండుగగా వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పూలను పూజించే గొప్ప సంస్కృతి మనదని అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగను భక్తితో జరుపుకోవాలని అన్నారు. జిల్లా ప్రజలందరికీ దసరా, బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య మాట్లాడుతూ, మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భక్తిశ్రద్ధలతో మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగను నిర్వహించుకోవాలని తెలిపారు. బతుకమ్మకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.ఈ బతుకమ్మ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిడబ్ల్యూఓ వినూత్న, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సమిష్టిగా పనిచేయాలి

*** జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):జిల్లాలో నేరాల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్ సూచించారు. శనివారం జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. కేసుల్లో బాధితులకు అందుతున్న నష్టపరిహారంపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జైలులో ఉన్న నిందితుల వివరాలు, వారి స్థితిగతులపై జైలు అధికారులతో సమీక్షించారు.సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి తాడూరి మహతి వైష్ణవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, అదనపు ఎస్పీ ఏ. నరేష్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనారాయణ, అటవీ అధికారి అప్పలకొండ, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు బిందు సేద్యంతో నీటి తడులు ఇవ్వాలి

*** ఉద్యాన,పట్టు పరిశ్రమ అధికారి ఎంవి.మధుసూదన్**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కూసుమంచి మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న ఉద్యాన పంటలు మిరప,మునగ,బొప్పాయి,ఆయిలపామ్ క్షేత్రాలను జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమ అధికారి ఎంవి.మధుసూదన్ శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించారు.ప్రస్తుతం ఉన్న ఎల్ నినో విపత్తు ఉద్యాన పంటల సాగు పై ఉన్న ప్రభావాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలని,మిరప రైతులు బిందు సేద్యం అందుబాటులో ఉంటే బిందు సేద్యం ద్వారా నీటి తడులు ఇవ్వాలని సూచించారు.తద్వారా నీటిని ఆదా చేయవచ్చని తెలిపారు.అలాగే ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితిలో మిరపలో చీడ పురుగులు,తెగుళ్ల సమస్య ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ముఖ్యంగా నల్ల తామర పురుగు ఉధృతికి తగు నివారణ చర్యలను సూచించారు.ఆయిల్ పామ్ రైతులు మొక్కకు నాలుగు వైపులా సమానంగా తడిచే విధంగా బిందు సేద్యం ద్వారా తడులు ఇవ్వాలని,దీంతో పాటు నిర్ణిత మోతదులో ఎరువులు ఇవ్వాలని సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పాలేరు ఉద్యాన అధికారిణి పి.అపర్ణ,రైతులు శరత్, రాంగోపాల్, సాయికుమార్, రవి,రాజశేఖర్ రెడ్డి,రవీందర్,రామారావు,తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి కల నెరవేర్చిన కేటీఆర్, కందాళ



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: అనారోగ్యంతో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడి కలను కేటీఆర్ నెరవేర్చారు. బాలుడితో స్వయంగా మాట్లాడి అతనితో ఫోటో దిగి ముఖంలో చిరునవ్వును నింపారు. కూసుమంచి మండలంలోని నరసింహులగూడెం గ్రామానికి చెందిన కర్నె ఆదినారాయణ కుమారుడు వినయ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.తన అభిమాన నాయకుడు కేటీఆర్ ను కలిసి ఫోటో దిగాలన్న తన కోరికను కుటుంబ సభ్యుల ద్వారా పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి తెలియజేశారు. దీంతో ఆయన విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం హైదరాబాద్ లోని కందాళ ఉపేందర్ రెడ్డి నివాసంలో బాలుడు వినయ్‌ను కేటీఆర్ కలిసి, ఆప్యాయంగా మాట్లాడారు.అతని ఆరోగ్య పరిస్థితిని తల్లితండ్రులను అడిగి తెలుసుకున్నారు.అవసరమైన వైద్య సహాయం అందించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.అభిమాన నాయకుడిని కలుసుకుని ఫోటో దిగాలన్న కోరిక నెరవేరడంతో వినయ్,కుటుంబ సభ్యులు కందాళకు,కేటీఆర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కుల వెంకటేశ్వర్లు,మాజీ ఎంపీటీసీ బజ్జూరి రాంరెడ్డి,మబిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శీలం శంకర్,పెరుమాళ్లపల్లి రామన్న,సుధాకర్,కర్నె లింగయ్య,తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహా లక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన సంతోషి మాత



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శని వారం 7వ రోజు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో శ్రీ సంతోషి మాత అమ్మవారు శ్రీ మహా లక్ష్మీ దేవి గా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ శ్రీ మహా లక్ష్మీ మాతకు కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవాని దీక్ష మాతలకు దీక్షా పూజలతో పాటు చండీ హోమం రుద్ర హోమం నిర్వహించారు. శ్రీ మహాలక్ష్మి దేవి అలంకార భక్తులకు సామూహికంగా కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి సన్నిధిలో గల శ్రీ చక్ర యంత్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల భాగంగా బ్రాహ్మణ ముత్తైదువకు సుహాసిని పూజ నిర్వహించారు. మంగళ నిరాజనం మంత్రపుష్పాలతో అమ్మవారిని కీర్తి పాటలు పాడారు. మహిళలు సామూహికంగా సౌందర్యలహరి శివానందలహరి లలితా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయం అధ్యక్షులు బ్రాహ్మణపల్లి మురళీధర్ ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాశ రావు కోశాధికారి కొత్త మల్లికార్జున్ యమా వెంకటేశ్వర్లు,ఉత్సవ నిర్వాహకులు గోపారపు రాజు, అలంకరణ భక్తులు రాచర్ల వెంకటేశ్వర రావు,మిరియాల శివ కుమార్, రాచర్ల కమలాకర్,దారం వెంకన్న, ఎర్రమల్ల ప్రసాద్, నూనే ప్రభాకర్ కమిటీ సభ్యులు కక్కిరేణి పద్మ, కనకరత్నం, పల్లవి, కవిత, నీరజ,నవ్య, కంచర్ల లీల, విజయ లక్ష్మి,అర్చకులు అశోక్ మిశ్రా, రాఘవాచార్యులు, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల పండుగకు ముందస్తు భరోసా

*** సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే,చైర్ పర్సన్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో ఆదివారం జరగనున్న సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని, పట్టణంలోని నిజాం చెరువు,ఎన్టీఆర్ స్టేడియంలో చేపడుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్,మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గూగులోతు జ్యోతి రమేష్ నాయక్ పరిశీలించారు.ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలకు హాజరయ్యే మహిళలకు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని, ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని,తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేసే సమయంలో పోలీసు,రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,పరిసర ప్రాంతాల్లో వీధి లైట్లను ఎక్కువగా ఏర్పాటు చేయాలని మున్సిపల్,రెవెన్యూ శాఖలకు సిఫారసు చేశారు.బతుకమ్మ ఆడే ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, వైస్ చైర్మన్ సుర్నపు సోమయ్య, స్థానిక వార్డు కౌన్సిలర్ కాటా భాస్కర్, డి ఈ ఉపేందర్, సీఐ రఘురాం రెడ్డి, ఎస్సై ఉమా, వార్డుల కౌన్సిలర్లు చిట్యాల జనార్దన్, పద్మం ప్రవీణ్, బొల్లు రాజు, నీరుటి లక్ష్మీనారాయణ,ఎడ్ల రమేష్,హరి సింగ్ నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ఎన్ఎస్ యుఐ నాయకులు తదితరులు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

*** సర్పంచ్ బానోత్ భిక్షం నాయక్**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని కూసుమంచి మండలంలోని గురువాయిగూడెం సర్పంచ్ బానోత్ భిక్షం నాయక్ అన్నారు.శనివారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై,రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా పేర్చారు. నృత్య కోలాటంతో బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ గౌరమ్మను పూజిస్తూ ఆడి పాడారు.ఈ సందర్భంగా భిక్షం నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని,పల్లె సంస్కృతిని,ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని బతుకమ్మ చాటిచెబుతుందన్నారు.తుదపరి స్థానిక చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పందిరి సంపత్ రెడ్డి,కార్యదర్శి పాల్తీయా కుషా,వార్డు సభ్యులు నాగిరెడ్డి, పద్మ,గ్రామ మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

నేడు.. రేపు ఓ మోస్తరు వర్షాలు

*** పలు జిల్లాల్లో కురిసిన వర్షం**



హైదరాబాద్: రాష్ట్రంలో ఆది, సోమవారాల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల పరిధిలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. మంగళ, బుధవారాల్లోనూ పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా ఉపరితల ఆవర్తనం, దక్షిణ కోస్తాంధ్ర నుంచి వాయవ్య బంగాళాఖాతం వరకు ఏర్పడిన ద్రోణి కారణంగా వర్షాలు కురిసే వీలుందని పేర్కొంది. మరోవైపు శనివారం భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి తదితర జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

*** రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యేఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్:పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని షాద్నగర్ ఎమ్మెల్యే, రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు - రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. శనివారం మహబూబ్నగర్ పట్టణంలోని బృందావన్ గార్డెన్స్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్తో పాటు రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్, మహబూబ్నగర్ ఎమ్మెల్యే మన్నెశ్రీనివాస్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, సంపత్కుమార్, శివసేన రెడ్డి, సరితా తిరుపతయ్య, మైనారిటీ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రెబ్బెన పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కాళేశ్వరం మల్టీజోన్1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: కాళేశ్వరం మల్టీజోన్1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ శనివారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులు, వివిధ విభాగాల పనితీరును పరిశీలించిన ఆయన, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. పక్కా ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, పెట్రోలింగ్ పటిష్టం చేయడంతో పాటు సైబర్ నేరాలు, గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సమాచారంతో నేరాలను అరికట్టాలని ఆదేశించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని డీఐజీ స్పష్టం చేశారు.

ఆయిల్ ఫామ్.. ఆరుతడి పంటలతో అధిక లాభాలు

- **వాడిపోయిన పత్తి పంటల పరిశీలన**
- **ఐఏఎస్, వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ కే సురేంద్రమోహన్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రైతులు వరికి బదులుగా.. ఆయిల్ ఫామ్.. ఆరుతడి పంటలకు ప్రాధాన్యమిస్తే.. అధిక లాభాలు పొందవచ్చని ఐఏఎస్, వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ కే సురేంద్రమోహన్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామంలో ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాత లోటు వల్ల వాడిపోయిన పత్తి పంటలను ఐఏఎస్, వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కే సురేంద్రమోహన్ వారం సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సురేంద్రమోహన్ మాట్లాడుతూ రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతు సంఘాలు, పట్టు పరిశ్రమలను , పంట ఉత్పత్తులను రైతుల స్వయంగా కొనడం అమ్మడం ద్వారా అధిక లాభాలు పొందాలని సూచించారు. వరి వేసే రైతులు వరికి బదులుగా ఆయిల్ ఫాం పంట ద్వారా కూడా అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా పత్తి రైతులు వారి ఇబ్బందులను తెలియజేయగా పంట పరిస్థితులను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని వాళ్లకి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె. హేమలత, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, ఉద్యానవన శాఖ అధికారి కవిత, వ్యవసాయ విస్తరణ అధికారి వెన్నెల, ఎన్నపల్లి వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ నిమ్మల సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

షాద్నగర్ ప్రీమియర్ లీగ్ విజేతలకు ఘనంగా బహుమతుల ప్రదానం

*** ఇండోర్ స్టేడియంలో క్రికెట్ వేలం టోర్నమెంట్ సందడి..**



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్: పట్టణంలో క్రీడా స్ఫూర్తిని చాటుతూ నిర్వహించిన షాద్నగర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఆక్షన్ టోర్నమెంట్ ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. షాద్నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్లో క్రికెట్ అభిమానులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విజేతలకు షాద్నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నేటి యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రికెట్ వంటి క్రీడలు యువతలో స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని అలవర్చుతాయని తెలిపారు. షాద్నగర్ ప్రీమియర్ లీగ్ వంటి టోర్నమెంట్ల నిర్వహణతో స్థానిక క్రికెట్ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిర్వాహకులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహించి స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంతో షాద్నగర్ ఇండోర్ స్టేడియంలో క్రీడా సందడి నెలకొంది. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ సి పెంటయ్య మురళీమోహన్ అప్పి కొప్పునూరి ప్రవీణ్, సాదిక్ ,జయప్రకాష్, బీరప్ప, నీరటి వాసు, షఫిద్దీన్, రవితేజ, కబీర్, మంగ మధు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగ బతుకమ్మ

: కలెక్టర్ అంకిత్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో శనివారం బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ శాఖ, మున్సిపాలిటీలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మెప్మా, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రకరకాల, రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళా అధికారులు, ఉద్యోగులు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ, కోలాటాలతో సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రకృతిని, పూలను, మహిళలను గౌరవించే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు . అనంతరం కలెక్టర్ జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి అనూష, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట పుల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో ముదిరాజుల పాండవ వనవాసం

*** గరిడేపల్లి లో గంపలతో వనవాస కార్యక్రమంలో పాల్గొన్న ముదిరాజ్ మహిళలు**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: మహాభారతంలోని పాండవుల వనవాస ఘట్టాన్ని స్మరించుకుంటూ గరిడేపల్లిలో ముదిరాజ్ కులస్తులు శనివారం వనవాస కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి, మహిళలు గంపలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లారు. పాండవుల వేషధారణతో వనవాస ఘట్టాన్ని ప్రదర్శిస్తూ సంప్రదాయాలను చాటుకున్నారు. ముదిరాజుల జానపద గాథల ప్రకారం తమ మూలాలను యయాతి, భరత, పాండవుల వంశాలతో ముడిపెడుతూ పాండవులను కులదైవాలుగా భావిస్తుంటారు. పాండవులు 12 ఏళ్ల అరణ్యవాసం, ఏడాది అజ్ఞాతవాసం చేసిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పాండవుల ధర్మనిష్ఠ, కష్టసహనాన్ని స్మరించుకుంటూ గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని గ్రామ దేవతలను ప్రార్థించారు.తరతరాలుగా వస్తున్న జానపద కళలు, వీరగాథలు, పూర్వీకుల చరిత్రను భావితరాలకు అందించడంతోపాటు కులస్తుల మధ్య ఐక్యత, బంధుత్వాలను పెంపొందించడమే ఈ ఉత్సవ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. అనంతరం గ్రామ శివారులోని పాండవులు దేవాలయం వద్దకు మెల్లతాళాలతో వనవాసం వెళ్లి అక్కడే వంటలు వండుకొని పెద్దమ్మ తల్లికి నైవేద్యాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలోకుల పెద్ద చామకూరి నాగేశ్వరావు మత్స్య పరిశ్రామిక సహకార సంఘం చైర్మన్ చామకూరి దశరథ మాజీ చైర్మన్ ప్రధాని సైదులు జిట్టబోయిన పకీరయ్య డైరెక్టర్లు ప్రధాని వెంకన్నప్రధాని అమరయ్య జిట్టబోయిన సంతు ప్రధాని వీరస్వామి చాగంటి నాగయ్య మర్రి రాములు చామకూరి హరీష్ ప్రధాని నాగేశ్వరావు ప్రధాని సైదులు రెడ్డిబోయిన షంబయ్య ప్రధాని గోపి తదితరులు ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు


అభ్యుదయ యూత్ నూతన కమిటీ ఎన్నిక

- **నూతన అధ్యక్షునిగా చెవగోని వెంకటేష్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 13వ వార్డు రామ్ నగర్ లో అభ్యుదయ యూత్ నూతన కమిటీ శనివారం ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడు చెరుకు అశోక్ గౌడ్, వర్కాల వెంకట్ కుమార్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు తొర్పునూరి బాబుగౌడ్ ల ఆధ్వర్యంలో నూతన కమిటీని ప్రకటించారు. అభ్యుదయ యూత్ నూతన కమిటీ అధ్యక్షునిగా చెవగొని వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షునిగా మార్గం నర్సింహ్మ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా తొర్పునూరి లింగస్వామి గౌడ్, కోశాధికారిగా వెంకటేష్ గౌడ్ కార్యదర్శిగా తొర్పునూరి చిన్న మల్లేష్ గౌడ్, కార్య నిర్వహణ కార్యదర్శిగా వర్కాల జయరాం గౌడ్, సలహా కార్యదర్శిగా చెవగోని రమేష్ గౌడ్, ప్రచార కార్యదర్శిగా చెరుకు రాము గౌడ్, సాంస్కృతిక కార్యదర్శులుగా తొర్పునూరి సాయిలు గౌడ్, బాలగోని రాంప్రసాద్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా తొర్పునూరి వెంకటేష్ గౌడ్, బెదరకోట వెంకటేష్, ఉష్కాగుల శ్రీశైలం గౌడ్, బందారపు శివగౌడ్, చెరుకు సాయి గౌడ్, మొగుదాల రమేష్ గౌడ్, ఊదరి రాకేష్ లు ఎన్నికయ్యారు. అభ్యుదయ యూత్ నూతన అధ్యక్షుడు చెవగోని వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ నూతన అధ్యక్షునిగా తన, కమిటీ ఎన్నికకు సహకరించిన పెద్దలకు, కాలనీ వాసులకు సీనియర్ యూత్ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. చౌటుప్పల్ మున్సిపల్ వ్యాప్తంగా యూత్ కమిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తూ, యూత్ కు మంచి పేరు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తొర్పునూరి పెద్ద మల్లేష్ గౌడ్, బాలగోని నర్సింహ గౌడ్, తొర్పునూరి జంగయ్య గౌడ్, విశ్వరూపం చారి, చెవగోని మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొలన్ హన్మంత్ రెడ్డి ని కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి:కుత్బుల్లాపూర్ నియోజకవర్గ హైదరాబాద్ మహబూబ్ నగర్, రంగా రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు నియమితులయ్యారు.ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా త్వరలో జరగనున్న(హైదరాబాద్ మహబూబ్ నగర్, రంగా రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణ, ఎన్నికల నిర్వహణ, పార్టీ శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై ఇరువురు నాయకులు చర్చించారు.

మొక్కల పెంపకంతోనే.. భవిష్యత్తు తరాల మనుగడకు సాధ్యం

- **ఇంటికో మొక్క, చెత్తబుట్టల పంపిణీ**
- **14వ వార్డ్ కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మొక్కల పెంపకంతోనే.. భవిష్యత్ తరాల మనుగడ సాధ్యమవుతుందని 14వ వార్డ్ కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 14వ వార్డులో చెత్తబుట్టలు, ఇంటికొక మొక్కను పంపిణీ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని కోరారు. ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఇంట్లోని చెత్తను మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన వాహనంలో వేసేందుకు వీలుగా మున్సిపాలిటీ తరఫున రెండు చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్నామన్నారు.ఒక బుట్టలో తడి చెత్త, మరో బుట్టలో పొడిచేత్తవేసి మున్సిపాలిటీ వాహనానికి ఇవ్వాలని కోరారు. భవిష్యత్తు తరాలకు చక్కటి వాతావరణం అందించాలంటే కేవలం చెట్లతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఇంటికి ఒక మొక్కను అందిస్తున్నామని, మొక్కను నాటడంతో పాటు సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీతారామచంద్రస్వామి దేవాలయ డైరెక్టర్ వర్కాల రవి గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్త, దొడ్డి గణేష్, నందగిరి సాయి గౌడ్, మండలోజు మనోజ్ చారి, వన సంరక్షణ అధికారి వేణు, శానిటరీ ఇన్స్ పెక్టర్ హనుమాన్, వార్డు అధికారి కిరణ్, బిల్లు కలెక్టర్ వెంకటేష్, జవాన్ నర్సింహ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి:దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం జగద్గిరిగుట్ట డివిజన్పరిధిలోని పలు ప్రాంతాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీకార్పొరేటర్ కొలుకుల జగన్,యూత్ నాయకులు కొలుకులజైహింద్ లు పలుఅమ్మవారి మండపాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతోఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,భవానిలు,తదితరులుపాల్గొన్నారు.

దిగ్గజ సంగీత దర్శకుడు దేవా కన్నుమూత

400 సినిమాలకు స్వరకర్తగా

దక్షిణాది సినీ పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. దిగ్గజ సంగీత దర్శకుడు దేవా (75) గుండెపోటుతో శనివారం చెన్నైలో కన్నుమూశారు. తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో కలిపి నాలుగు వందలకుపైగా సినిమాలకు సంగీతం అందించారు దేవా. రజనీకాంత్, చిరంజీవి, కమల్‌హాసన్ పవన్ కళ్యాణ్ వంటి సూపర్ స్టార్లతో కలిసి పనిచేశారు.





ఇళయరాజా గురువు...

దేవా అసలు పేరు దేవనేశన్ చొక్కలింగం. 1950లో చెన్నైలో జన్మించారు. దేవా మ్యూజిక్ జర్నీ దూరదర్శన్‌తో మొదలైంది. టీవీ సీరియల్స్, షోలకు సంగీతం అందించారు. ఇళయరాజాకు గురువైన ధనరాజ్ వద్దే దేవా కూడా సంగీత పాఠాలు నేర్చుకున్నారు. 1986లో వచ్చిన మాట్టుకర మన్నారా మూవీతో మ్యూజిక్ డైరెక్టర్‌గా ఆయన జర్నీ మొదలైంది. వైగసి పొరందాసు సినిమాతో తొలి విజయాన్ని అందుకున్నారు. లవ్‌స్టోరీగా తెరకెక్కిన ఈ సినిమాతో తమిళనాట దేవా పేరు మారుమోగింది. 1992లో రజనీకాంత్ హీరోగా నటించిన అన్నామలై దేవా సినీ ప్రయాణాన్ని మలుపుతిప్పింది. రజనీకాంత్ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్లుగా బాషా, అరుణాచలం విజయాల్లో దేవా మ్యూజిక్ పాత్ర కూడా ఉంది.

తెలుగులోనూ...

మ్యూజిక్ డైరెక్టర్‌గా దేవా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే. చిరంజీవి మాస్టర్, పవన్ కళ్యాణ్ తొలి ప్రేమతో పాటు పలు విజయవంతమైన సినిమాలకు సంగీత దర్శకుడిగా పనిచేశారు. ఈ సినిమాల్లో మెలోడీ ప్రధానంగా దేవా అందించిన పాటలు పెద్ద హిట్టయ్యాయి. టాలీవుడ్ లో ఆటోడ్రైవర్, గ్రీకువీరుడు, కలుసుకోవాలని, నాగ, నాయుడమ్మ, విజయదశమితో పాటు సంగీత దర్శకుడిగా చాలానే సినిమాలు చేశారు దేవా. ప్రేమలేఖ వంటి డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించారు. రజనీకాంత్ ఇంట్రడక్షన్ కోసం ఇప్పటికీ దేవా మ్యూజిక్‌నే సినిమాల్లో వాడుతున్నారు.

ఏఆర్ రెహమాన్‌తో పోటీ...

ఇళయరాజా, ఏఆర్ రెహమాన్ వంటి దిగ్గజ సంగీత దర్శకులతో పోటీని తట్టుకొని తమిళ సినీ పరిశ్రమలో తనదైన ముద్రవేశారు దేవా. ఒకానొక దశలో వారికి గట్టి పోటీ ఇచ్చారు. 1996లో ఒకే ఏడాది 36 సినిమాలకు సంగీతం అందించి రికార్డ్ క్రియేట్ చేశారు. గానా అనే చెన్నై జానపద శైలిని సినిమా రంగానికి పరిచయం చేసింది దేవానే. దేవా కుటుంబం మొత్తం సంగీతకళకే పరిమితమైంది. దేవా తనయుడు శ్రీకాంత్ దేవాతో పాటు సోదరులు సబేష్ – మురళి పలు తమిళ, తెలుగు సినిమాలకు మ్యూజిక్ డైరెక్టర్లుగా పనిచేశారు. మేనల్లుడు జై తమిళంలో హీరోగా కొనసాగుతోన్నారు.



దేవా తెలుగు సూపర్ హిట్ సాంగ్స్

స్టైలు స్టైలురా (బాషా)
బాషా చూడూ (బాషా)
తమ్ముడూ.. అరే తమ్ముడూ (మాస్టర్)
ఏప్రిల్ మాసంలో (వాలి)
సోనా సోనా (వాలి)
ఈ మనసే (తొలి ప్రేమ)
ఏమి సోదరా (తొలి ప్రేమ)
గగనానికి ఉదయం ఒకటే (తొలి ప్రేమ)
తిలోత్తమా (మాస్టర్)
చందమామ (ఆటో డ్రైవర్)

ఓటీటీలోకి నాని ప్యారడైజ్



నాని హీరోగా నటించిన ది ప్యారడైజ్ మూవీ నెగెటివ్ టాక్‌తో సూపర్ హిట్‌గా నిలిచింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్‌గా నటించింది. కీర్తి సురేష్ ఓ స్పెషల్ సాంగ్ చేసింది. తాజాగా ప్యారడైజ్ మూవీ ఓటీటీలోకి వస్తోంది. అక్టోబర్ 22 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ప్యారడైజ్ స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల అవుతోంది. థియేట్రి కల్ వెర్షన్‌తో పోలిస్తే ఓటీటీలో కొన్ని మార్పులతో ఈ సినిమా రిలీజ్ కానున్నట్లు సమాచారం. కొన్ని కొత్త సీన్లతో పాటు ఓ పాటను యాడ్ చేయనున్నట్లు వార్తలొస్తున్నాయి.

కీర్తి సురేష్ డబుల్ ట్రీట్



బర్త్‌డే సందర్భంగా అభిమానులకు కీర్తి సురేష్ డబుల్ ట్రీట్ ఇచ్చింది. టాలీవుడ్ మల్టీ స్టారర్ మూవీ జనవరి 12 విడుదల నుంచి ఆమె ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. బాలీవుడ్ వెబ్‌సిరీస్ అక్క టీజర్ కూడా విడుదలచేశారు. తెలుగు మూవీలో క్లాస్ లుక్‌లో కనిపించిన ఈ ముద్దుగుమ్మ హిందీ వెబ్‌సిరీస్‌లో మాస్ రోల్‌లో అదరగొట్టింది. వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతోన్న జనవరి 12 విడుదల వచ్చే సంక్రాంతికి థియేటర్లలోకి రాబోతుంది. ఈ పోస్టర్‌లో ట్రాక్టర్ నడుపుతూ కీర్తి సురేష్ కనిపిస్తోంది. తలపాగా చుట్టుకొని కళ్లద్దాలు పెట్టుకొని లంగా ఓణీలో కీర్తి సురేష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. కీర్తి సురేష్ బాలీవుడ్‌లో అక్క పేరుతో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ వెబ్‌సిరీస్ చేస్తోంది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సిరీస్ అక్టోబర్ 30 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది. ధర్మరాజ్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. అక్క వెబ్‌సిరీస్ టీజర్ శనివారం రిలీజైంది. ఇందులో భవానీ అనే కరుడుగట్టిన లేడీ గ్యాంగ్‌స్టర్‌గా మాస్ రోల్‌లో కీర్తి సురేష్ అదరగొట్టింది. ఆమె లుక్, మ్యానరిజమ్స్ డిఫరెంట్‌గా ఉన్నాయి.



కల నెరవేరిన మరునాడే హఠాన్మరణం



మలయాళ వెబ్‌సిరీస్ కప్పిస్కాడ్ విడుదలతో దర్శకుడిగా తన పేరు స్క్రీన్‌పై చూసుకోవాలనే ఎన్నో ఏళ్ల బేల్‌రాజ్ కల నెరవేరింది. కానీ అంతలోనే విషాదం చోటుచేసుకుంది. గుండెపోటుతో ఈ దర్శకుడు హఠాన్మరణం చెందారు. కొచ్చిలోని ఓ హోటల్ రూమ్‌లో అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ని సిబ్బంది హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే గుండెపోటుతో కన్నుమూసినట్లు డాక్టర్లు ప్రకటించారు. 27 ఏళ్ల చిన్న వయసులోనే గుండెపోటుతో మరణించడంతో మలయాళ సినీ వర్గాలు దిగ్భ్రాంతికి లోనయ్యాయి. బేల్‌రాజ్‌కు నెల రోజుల క్రితమే వివాహమైనట్లు తెలిసింది.

జైలర్ 2 డైరెక్టర్‌తో ఎన్టీఆర్ పాన్ ఇండియన్ మూవీ



జైలర్ దర్శకుడు నెల్సన్‌తో యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఓ సినిమా చేయబోతున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో చాలా కాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ రూమర్లను నిజం చేస్తూ ఎన్టీఆర్, నెల్సన్ సినిమాను నిర్మాత సూర్యదేవర నాగవంశీ అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ సినిమాకు రాక్ అనే టైటిల్ ఖరారు చేసినట్లు సమాచారం. భుజం గాయం కారణంగా మూడు నెలల పాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చిన యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఇటీవలే తిరిగి డ్రాగన్ సెట్స్‌లో ఇటీవలే ఎన్టీఆర్‌ను కలిసిన నెల్సన్ కథను వినిపించినట్లు సమాచారం. యాక్షన్, కామెడీ సినిమా చేసి చాలా కాలం కావడంతో యంగ్ టైగర్ కూడా ఈ సినిమాకు ఓకే చెప్పాడని అంటున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.